



నాన్నే స్ఫూర్తి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఎన్ని కష్టాలు పడినా మమ్మల్ని ఉన్నతంగా చదివించారు
- ఆయన నుంచే కష్టపడే తత్వం.. చేసే పని పట్ల మక్కువ అలవాటైంది
- ప్రొబెషనరీ పీరియడ్‌లో ఆరు నెలలు మహబూబ్‌నగర్‌లోనే ట్రైనింగ్ చేశా
- మనసుకు నచ్చిన కేసులెన్నో ఉన్నాయి.. చేసిన పని సంతృప్తిని ఇచ్చింది
- నేరాల తీరు మారింది.. చదువుకున్న వారే అత్యాశతో తప్పటడుగులు వేస్తున్నారు
- కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కోసం క్యాంపులు నిర్వహిస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి


'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

'ప్రతీ వ్యక్తికి జీవితంలో ఎవరో ఒకరు స్ఫూర్తిగా నిలుస్తారు.. నాకు మాత్రం మా నాన్నే స్ఫూర్తి.. తాను ఎన్ని కష్టాలు పడినప్పటికీ మమ్మల్ని ఉన్నత విద్యాభ్యాసం చేయించారు. తాత, ముత్తాతలు సంపాదించిన ఆస్తిపాస్తులు లేవు.. పెద్ద ఉద్యోగమో, వ్యాపారమో కాదు నాన్నది.. ఆయన సంపాదించిన మొత్తంతోనే మమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు.. చిన్న చికెన్‌షాపు నడుపుకుంటూ, మాతో ఉన్నత కలలు కనేలా చేశారు.. ఆయన నుంచే కష్టపడే తత్వం.. తపన, ఏ పని చేసినా చేసే పని పట్ల మక్కువ పెంచుకోవడం నేర్చుకున్నాను.. మమ్మల్ని చదివించడానికి వందల మందిని వాకబు చేసి, మంచి కాలేజీల్లోనే చేర్పించారు. అమ్మానాన్నల కష్టఫలితంగా చెల్లి డాక్టర్ అయ్యింది.. నేను గ్రూప్ 1 ద్వారా పోలీసు శాఖలో పని చేస్తున్నాను. నా వృత్తి జీవితం ఎంతో సంతృప్తిని ఇస్తోంది.. ఏ కేసు అయినా ఛాలెంజ్‌గా తీసుకుని చేస్తే అత్యుత్తమ ఫలితాలు ఉంటాయి..' అంటున్న మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకీ ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ..

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం ఎలా సాగింది?

మాది పాత నల్గొండ, ప్రస్తుత సూర్యాపేట జిల్లా కోదాడ. అమ్మానాన్న చిన్న చికెన్ షాపు నడపుకునేవారు. దాంతో వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే నన్ను, నా చెల్లెలిని బాగా చదివించాలని తపనపడ్డారు. ఆయనకున్న దానితో మాకు ఉన్నతమైన విద్య అందేలా చేయడంతోపాటు విలువలతో ఎలా బతకాలో నేర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడటం, మాకు ఎక్కడ మంచి ఎడ్యుకేషన్ దొరుకుతుందో కనుక్కోవడం నాన్న పనిగా ఉండేది.

ఉద్యోగ జీవితం ఎలా ఉంది?

నాకు మొదటి నుంచీ సివిల్ సర్వీసెస్ పట్ల ఆసక్తి ఉంది. ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ అయినప్పటికీ, బీటెక్ పూర్తయిన వెంటనే అనేక ఆప్షన్లు నా ముందు ఉన్నాయి. తక్కువ పోస్టులే కదా అని ప్రయత్నించడం మానుకోలేదు. 2007లో గ్రూప్-1 ద్వారా ఉద్యోగ అర్హత సాధించాను. మనలో సాధించాలనే తపన, దానిపట్ల చిత్తశుద్ధి ఉంటే ఎంత పెద్ద మైలు రాయి అయినా సులభంగా చేరుకోవచ్చు. అలాగే ఏ పని చేసినా పూర్తిస్థాయి శ్రద్ధ, నిబద్ధత పనిచేయాలని మా నాన్న నుంచి నేర్చుకున్నాను.

వృత్తిగత జీవితం సంతృప్తి ఇచ్చిందా?

ఏ కేసు ఎదురైనా చాలెంజ్‌గా తీసుకుని పనిచేస్తే ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. నాకు వ్యక్తిగతంగా చాలా కేసులు సంతృప్తినిచ్చాయి. కానీ వెల్లడించలేం. మేము కష్టపడి చేసిన కేసుల్లో కన్విక్షన్ వస్తే చాలా సంతృప్తి

(మిగతా 6లో..)

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాలు తయారు చేసే మండపం



దేవదేవుడికి దళితుల సేవ

- చిన్న వడ్డెమాన్‌లోని ప్రత్యేక గదిలో ఉద్దాల తయారీ 7
- ఉద్దాలను దర్శించుకున్న తర్వాతే స్వామి సన్నిధికి భక్తులు

విద్యాశాఖకు అవినీతి చెద

- పదోన్నతులు, సీనియారిటీ జాబితా కోసం రూ.లక్షలు డిమాండ్
- ఏ పని కావాలన్నా డబ్బులు డిమాండ్ చేస్తున్న మహబూబ్‌నగర్ డీఈవో
- ఏసీబీకి పట్టించిన బాధితురాలు

మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి. ఏ పని కావాలన్నా, ఏ ఫైల్ కదలాలన్నా చేయి తడపనిదే పని అవదన్న స్థాయికి ఆ శాఖను దిగజార్చారు. శాఖకు అవినీతి చెద పట్టించారు. మహబూబ్‌నగర్ విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న ఏ రవీందర్ గురువారం ఓ ఉపాధ్యాయురాలికి సంబంధించి సీనియారిటీ జాబితా విషయంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారుల చేతికి చిక్కడంతో విద్యాశాఖ ఉలిక్కిపడింది. ఉమ్మడి జిల్లాలో ఈయన ఎక్కడ పని చేసినా అవినీతి ఆరోపణలు ఎదుర్కొని, వివాదాస్పద అధికారిగా పేరు తెచ్చుకున్నారు. బదిలీ అయినా,

(మిగతా 7లో..)

బాధితులకు భరోసా

- పాలమూరు, గద్వాలలో ఈనెల 12న భరోసా కేంద్రాల ప్రారంభం 6
- అత్యాధునిక హంగులతో సిద్ధమైన కేంద్రాలు
- అఘాయిత్యాలు.. అన్యాయాలకు గురైన మహిళలకు అండగా..

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు కోసం ఈ నెల 9, 10 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకుగాను బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, వారందరూ తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌లో ఉన్న బీఎల్‌వోతో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇదివరకే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు మార్పులు చేర్పులు చేసుకోవాలంటే.. బీఎల్‌వోల వద్ద ఉన్న ఫారం- 6, 7, 8, 8ఏ లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు రెండు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని తెలిపారు.

పాలమూరులో క్రీడా పండుగ

- నేటి నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ 6
- పాల్గొననున్న 240 మంది క్రీడాకారులు



న్యూస్ బాక్స్

కాన్పు కోసం వచ్చిన బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన


దేవేంద్రమ్మ(ఫైల్)

మక్తల్ రూరల్, నవంబరు, 7(ఆంధ్రజ్యోతి): కాన్పునకు వచ్చిన బాలింత మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గడ్డంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డంపల్లి గ్రామానికి చెందిన దీపిక అలియాస్ దేవేంద్రమ్మ(28)కు కర్ణాటక రాష్ట్రం సజ్జాపూర్‌కు చెందిన శివతో ఎనమిదేళ్ల కిందట వివాహమైంది. ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడో కాన్పు కోసం బుధవారం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తక్కువగా ఉందని వైద్యులు రక్తం ఎక్కించారు. ఆ తరువాత ఆమెకు వాంతులు కావడంతో చేతులెత్తేసి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. నారాయణపేటకు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే దీపిక మృతి చెందిందని బంధువులు, గ్రామస్థులు గురువారం అధిక సంఖ్యలో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి, నిరసన చేపట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు, నాయకులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

నేడు ఉద్దాలు

- జనసంద్రంగా మారనున్న కురుమూర్తి జాతర మైదానం
- అడుగడుగునా పోలీసుల భారీ బందోబస్తు


ఉద్దాలు(ఫైల్)

చిన్నచింతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం ఉద్దాలోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. అందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని పల్లమర్రి గ్రామంలో మేదరులు నియమనిష్టలతో తయారు చేసిన చాటకు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రజాప్రతనిధులు, అధికారులు, భక్తులు ట్రాక్టర్‌పై మేళతాళాలతో గ్రామం గుండా బయల్దేరతాయి. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల తయారీ గదికి చేరుకుంటాయి. అక్కడ నాయకులు, అధికారులు, నాయకులు, భక్తులు ఉద్దాలను దర్శించుకుంటారు. పల్లమర్రి గ్రామం నుంచి ఊరేగింపుగా తెచ్చిన చాటను ఉద్దాల తయారీ గదిలోకి తీసుకెళ్తారు. చాటలోకి ఉద్దాలను పెట్టిన తరువాత పూజలు చేస్తారు. చాటతోపాటు ఉద్దాలను ఉద్దాల తయారీ గది ఎదుట భక్తుల దర్శనం కోసం ఉంచుతారు. అనంతరం ఉద్దాల ఊరేగింపు సమపంలోని ఊక చెట్టు వాగుకు కదులుతాయి. అక్కడ ఉన్న వేలాది మంది భక్తులు కింద కూర్చొని ఉండగా, వారి తలల మీదుగా ఉద్దాలను తీసుకెళ్తారు. సాయంత్రం జాతర మైదానంలోని ఉద్దాల దశమికట్టకు చేరుకుంటాయి. అక్కడ ఊరేగింపు చేశాక, గుట్టపై నున్న ఉద్దాల మండపానికి చేర్చుతారు.

భారీ బందోబస్తు

ఉద్దాలోత్సవం సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జాతరలో ప్రత్యేక ఔట్‌పోస్టు, కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. జాతరలో సంపూర్ణమద్యపాన నిషేధం అమలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు వైద్య సదుపాయం కల్పించనున్నారు.

కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్(ఆంధ్రజ్యోతి): కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆమె బస్సులకు పూజలు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక బస్సులను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి గురువారం 10 బస్సులు, శుక్రవారం 20, శనివారం 10 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి గురువారం 38, శుక్రవారం 103, శనివారం 38 బస్సులు మొత్తం 179 బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా పెంచుతామన్నారు.

మైనారిటీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ

నారాయణపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ మైనారిటీ కమిషన్ చెర్మన్ తారిక్ అన్సారీ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎస్పీ లింగయ్య, మైనారిటీ అధికారి రశీద్‌తో కలిసి కలెక్టరేట్‌లో మైనారిటీల సంక్షేమంపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో సిబ్బందికి మైనారిటీలు సహకరించాలని తారిక్ అన్సారీ అన్నారు. అనంతరం పలు విషయాలపై కలెక్టర్‌తో చర్చించారు.


కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో మాట్లాడుతున్న తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ

తర్వాత తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇంటర్ కళాశాలను అన్సారీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. హాస్టల్ నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు.

పౌరసరఫరాల శాఖ డీఎం ఇర్ఫాన్ రిలీవ్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వనపర్తి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖలో గత కొన్ని రోజులుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎం ఇర్ఫాన్‌ను రిలీవ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'పౌరసరఫరాల శాఖలో దుమారం' పేరిట కథనం రావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అతన్ని రిలీవ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఏడు రోజుల క్రితం ఇర్ఫాన్‌ను మహబూబ్‌నగర్ డీఎంగా బదిలీ చేస్తూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే బదిలీపై ఇర్ఫాన్ మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లకుండా ఆ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ వచ్చారు. అతని స్థానంలో నిజామాబాద్ జిల్లా నుంచి డీఎంగా పని చేస్తున్న వైపీ రమేష్ ఇక్కడికి బదిలీ కావడంతో అతన్ని బాధ్యతలు చేపట్టకుండా పైరవీలు చేసి ఇర్ఫాన్ విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఈ విషయంపై జిల్లా రాజకీయాలతో పాటు అధికారుల్లో పెద్ద దుమారం రేగింది. అతని అవినీతితో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ విధులు నిర్వహిస్తుండటంతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ విషయమై వార్త ప్రచురితం అయ్యింది. ఎట్టకేలకు రాష్ట్ర స్థాయి పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి రిలీవ్ చేశారు.


ఆర్అండ్‌బీ చీఫ్ సెక్రటరీ నుంచి జీవో తీసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఘాట్ రోడ్డుకు రూ.110 కోట్లు మంజూరు

- కురుమూర్తి ఆలయం వరకు నిర్మాణం

చిన్నచింతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తిస్వామి ఆలయ గుట్టపైకి వెళ్లేందుకు ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేసింది. అందుకు సంబంధించిన జీవోను దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డికి ఆర్అండ్‌బీ చీఫ్ సెక్రటరీ గురువారం అందించారు. ఘాట్ రోడ్డు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణకు మాలలే అడ్డు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


ప్రసంగిస్తున్న మంద కృష్ణ మాదిగ

పాలమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన మాలలే అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాదిగల ధర్మయుద్ధ మహాసభకు ఉమ్మడి జిల్లాకు చెందిన మాదిగలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు మందకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మాలలు లెక్క చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నుంచి తెలంగాణలో వివేక్ కుటుంబం వరకు వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగల నుంచి ప్రశ్నించటానికి ఒక్క ఎంపీ టికెట్ కూడా కాంగ్రెస్ ఇవ్వకపోవటమే ఇందుకు నిదర్శనమన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను మొదట అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఢిల్లీ ఖర్గే నుంచి ఒత్తిడితో రేవంత్‌రెడ్డి ఏమీ చేయలేని పరిస్థితి ఉన్నదన్నారు. వర్గీకరణ చేస్తే ఆయన సీఎం సీటు ఉండదని భయం పట్టుకున్నదన్నారు. 59 కులాలకు గాను 58 కులాలు వర్గీకరణకు అనుకూలంగా ఉంటే కేవలం ఒక్క మాలలు మాత్రమే అడ్డుకుంటున్నారని అన్నారు. వర్గీకరణ చేస్తామంటేనే ఆనాడు చంద్రబాబుకు మద్దతు ఇచ్చామని, ఈనాడు వర్గీకరణకు సహకారం అందిస్తామంటేనే బీజేపీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని మరువరాదన్నారు.

సన్నాల కొనుగోలుకు సాంకేతిక పరిజ్ఞానం

- నారాయణపేట జిల్లాకు వచ్చిన ప్రత్యేక పరికరాలు


నారాయణపేటకు వచ్చిన సన్న ధాన్యం నాణ్యతను కొలిచే పరికరాలు

నారాయణపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో వడ్ల సేకరణలో నిబంధనలను కఠినతరం చేసింది. అందుకోసం మొదటిసారి సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. గ్రెయిన్ క్యాలిపర్ పరికరాలు 26, అస్యూరీ రీమువల్ వరి పొట్టు తొలిచే రౌండ్ బాక్స్‌లు 100 నారాయణపేట వ్యవసాయ మార్కెట్‌కు వచ్చాయి. వరి పొట్టు తొలిచే బాక్స్ ద్వారా పొట్టు తీశాక గ్రెయిన్ క్యాలిపర్ పరికరంలో బియ్యపు గింజను ఉంచుతారు. పొడువు ఆరు మిల్లీ మీటర్లు, వెడల్పు రెండు మిల్లీ మీటర్ల కంటే తక్కువ ఉండి, పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 కన్నా ఎక్కువ ఉండకుంటేనే బోనస్ ఇవ్వనున్నట్లు ఆంక్షలు పెట్టారు. దాంతో బోనస్ అందుతుందో లేదనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 101 కొనుగోలు కేంద్రాలకు గాను 96 కేంద్రాలను ప్రారంభించారు.

క్రైం కార్నర్

రెండు దుకాణాలు దగ్ధం

దేవరకద్ర, నవంబరు (ఆంధ్రజ్యోతి) 7 : ప్రమాదవశాత్తు రెండు దగ్ధమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నున్న టీవీ మెకానికల్, ఇనుప సామాన్ల దుకాణంలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. చుట్టు పక్కను న్న వారు గమనించి మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికీ రెండు దుకాణాల్లో ఉన్న సామగ్రి పూర్తి కాలి పోయింది. ఐదు లక్షల రూపాయల విలువైన టీవీ విడి భాగాలు, ఇనుప సామన్ల దుకాణంలో రెండు లక్షల రూపాయల విలువైన సామగ్రి కాలిపోయిందని బాధితులు తెలిపారు. తమను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందించారు.

బాలిక అదృశ్యం

రాజాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఓ తండా బాలిక అదృశ్యం అయ్యిందని ఎస్‌ఐ కె.రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ బాలిక గురువారం ఉదయం కుట్టు పని కోసం మండల కేంద్రాననికి వచ్చింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పశువుల చోరీ: కేసు నమోదు

మూసాపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో పశువుల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముష్టి చెన్నప్పకు రెండు గేదెలు, రెండు దూడలు ఉండగా వాటిని బుధవారం రాత్రి ఎప్పటిలాగే తన పొలంలోని కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం పొలం వద్ద నాలుగు పశువులు కనిపించకుండా పోయాయి. చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా పశువుల జాడ కనపించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ రూ.1.80 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేయగా, పశువులు మద్దూరు సంతలో దొరికినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



బిజినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గొండ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన 70 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడి శవాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు. అటుగా వెళ్తున్న స్థానికులు అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలి యని వృద్ధుడిని గుర్తించి పోలీసులకు సమా చారం ఇవ్వ డంతో పరిశీలించి శవాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు పేర్కొ న్నారు. శవాన్ని ఎవరైనా గుర్తిస్తే పోలీసుల కు సమా చారం ఇవ్వాలని కోరారు.

బాధితులకు భరోసా..





పాలమూరులో ప్రారంభానికి సిద్ధమైన భరోసా కేంద్రం

BHAROSA
...rt Center for Women and C...
...tive of the Cyberabad...

- పాలమూరు, గద్వాలలో ఈనెల 12న భరోసా కేంద్రాల ప్రారంభం
- అత్యాధునిక హంగులతో కేంద్రాలు
- అఘాయిత్యాలు.. అన్యాయాలకు గురైన మహిళలకు అండగా
- వైద్యులు, పోలీసులు, అడ్వకేట్‌ల సంరక్షణలో బాధితులు

మహబూబ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై ఎన్నో రకాల దాడులు.. అవమానాలు జరుగుతున్నాయి. చాలా మంది బయటకు వచ్చి చెప్పుకోలేక రాజీ పడుతుంటారు. కొందరు ధైర్యం చేసి బయటకు వచ్చినా పోలీస్‌స్టేషన్‌లకు వెళ్తే.. చుట్టూ ఉండే పురుష అధికారుల ఎదుట తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. అదే మహిళలే ఉంటే వారి బాధలను పంచుకోవచ్చు. ఈ ఆలోచనలోంచి పుట్టిందే భరోసా కేంద్రం.

అండగా ఉండేందుకు..

అన్యాయానికి గురైన మహిళలు, బాలికలకు భరోసా ఇచ్చేందుకు పోలీస్‌శాఖ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అక్కడున్నవారంతా మహిళలే కావడంతో వారి వద్ద వాస్తవాలు వెల్లడించేందుకు అవకాశం ఉంది. ఇందులో పనిచేయడానికి విద్యావంతులు, మానసిక దృఢత్వం కలిగిన వారినే ఎంపిక చేస్తారు. సమస్యలను సులభంగా తెలుసుకుని పరిష్కరించడంతోపాటు వారికి వివరాలను గోప్యంగా ఉంచుతారు. తమకంటూ ఒక భరోసా లభిస్తుందన్న ధైర్యం అక్కడికి వెళ్లిన వారికి కలిగించమే ఈ కేంద్రం ఉద్దేశం.

మహబూబ్‌నగర్, గద్వాలలో ఏర్పాటు

మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మహబూబ్‌నగర్‌లోని మోనప్పగుట్టలో అత్యాధునిక హంగులతో భరోసా కేంద్రంతో పాటు షీటీమ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 12న వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుచే భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గద్వాల కేంద్రం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

ఈ కేంద్రంలో ఉండే అధికారులు..

పోలీస్‌శాఖకు చెందిన మహిళా ఉద్యోగులు, కౌన్సెలర్‌లు, లీగల్ అడ్వయిజర్లు, వైద్య సిబ్బంది, సామాజిక కార్మికులు, సపోర్ట్ సిబ్బంది ఉంటారు. వీరంతా మహిళలే.

- పోలీస్ అధికారులు బాధితుల ఫిర్యాదులు స్వీకరించడం, కేసు నమోదు, విచారణ చేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో వారికి రక్షణతోపాటు భద్రత కల్పిస్తారు.
- కౌన్సెలర్లు బాధితుల మానసిన సమస్యలను పరిష్కరించేందుకు వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని వారికి మానసిక బలాన్ని పెంచేందుకు కౌన్సెలింగ్ ఇస్తారు.
- లీగల్ అడ్వయిజర్లు బాధితులకు చట్టపరమైన సమస్యలకు సంబంధించిన సలహాలు ఇస్తారు. కోర్టు కేసుల సమయంలో వారికి సహకారం అందిస్తారు.
- వైద్య సిబ్బంది, వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు కేంద్రంలోనే నిర్వహిస్తారు. వారికి కావాల్సిన ట్రీట్‌మెంట్ అందిస్తారు. అత్యవసర వైద్య సహాయంతో పాటు రిపోర్టులను కూడా అందిస్తారు.
- సామాజిక కార్యకర్తలు బాధితులకు పునరావాసం పొందడంలో సహాయం అందిస్తారు. సామాజిక సేవా సిబ్బంది భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంటారు. బాధితులు తిరిగి సాధారణ జీవితంలో చేరేందుకు అవసరమైన దిశానిర్దేశం అందిస్తారు.
- సపోర్ట్ సిబ్బంది భరోసా కేంద్రం నిర్వహణ కోసం సహాయ సిబ్బంది అందుబాటులో ఉంటారు. వీరు బాధితులకు అన్ని రకాల సౌకర్యాలను అందిస్తారు.

అత్యాధునిక హంగులు

పాలమూరులో ఏర్పాటు చేసిన కేంద్రం అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంది. మొదటి అంతస్తులో షీటీమ్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ మంది బాధితులు వచ్చినా వారికి కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు ఉంటాయి. మెడికల్ ఎగ్జామిన్ విభాగం, కౌన్సెలింగ్ కోసం, కాన్ఫరెన్స్ రూమ్, సపోర్ట్ స్టాఫ్ గది, రికార్డ్‌ల గది ఇలా అన్ని రకాల గదులను పకడ్బందీగా ఏర్పాటు చేశారు.

పూర్తి అండగా ఉండేందుకు..

బాధితులకు భరోసా ఇచ్చేందుకు భరోసా కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. అనుభవజ్ఞులైన మహిళా వైద్యులు, పోలీసులు, న్యాయ నిపుణులు, సహాయకులు, స్వచ్ఛంద సేవకులు అందుబాటులో ఉంటారు. బాధితులకు మానసిక ధైర్యం ఇవ్వడంతో పాటు, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. 498 కేసులో కౌన్సెలింగ్ చేయడం, చిన్నారులకు జరిగిన అన్యాయాలు, పోక్సో కేసులపై బాధితుల నుంచి వివరాలు తీసుకుని భరోసా ఇచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.

- జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

- రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీందర్ నాయక్

గద్వాల న్యూటౌన్/ధరూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలు జాతీయ వ్యాధి నిరోధక టీకాలు, జాతీయ కుష్టు వ్యాధుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. వ్యాధుల నియంత్రణపై, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు డీఎంహెచ్‌వో సిద్దప్ప, వైద్యసిబ్బంది సన్మానించారు. ప్రోగ్రాం అధికారులు సంధ్యాకిరణ్మయి, నవీన్‌కుమార్‌రెడ్డి, రిజ్వానా తస్నీన్, ప్రసూనరాణి, రాజు, వైద్యసిబ్బంది ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డైరెక్టర్ రవీంద్రనాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. ధరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని ప్రోగ్రాంలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ పనిచేసే సిబ్బంది అందరూ సమయపాలన పాటించి, మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని ఐపీ వార్డు, ఓపీ, ప్రసూతి సేవలు అందించే గదులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. తప్పనిసరిగా ప్రజలను ప్రభుత్వ ఆస్పత్రుల వైపు మళ్లించేందుకు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.



ధరూరులో పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ రవీంద్రనాయక్

పాలమూరులో క్రీడా పండుగ



మహబూబ్‌నగర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ పోటీలకు పూర్తయిన ఏర్పాట్లు

- నేటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ
- పాల్గొననున్న 240 మంది క్రీడాకారులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి క్రీడా పండుగకు వేదిక కానుంది. శుక్రవారం నుంచి మహబూబ్‌నగర్ స్టేడియం మైదానం, ఇండోర్ స్టేడియంలో పదో తేదీ వరకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ జరగనున్నది. ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బాలికలకు స్టేడియం, బాలురకు చైతన్య స్కూల్‌లో బస కల్పిస్తున్నారు. స్టేడియంలో భోజన వసతి కల్పిస్తున్నారు.

పాల్గొననున్న పది జిల్లాల జట్లు

బాల, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. టోర్నీని సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, పలువురు హాజరై ప్రారంభించనున్నారు.

పాలమూరు జట్టు వివరాలు

బాలుర జట్టులో అదిత్, భానుప్రకాష్, సాయికృష్ణ, యశ్వంత్, సనద్, కేతవత్, అనిల్, ఎస్.అర్జున్, గణేష్, హిరాత్, శ్రీను, జి.పవన్, రామ్‌చరణ్ ఉన్నారు. బాలికల జట్టులో హర్షిత, వైష్ణవి, చైత్ర, హరిణి, శ్రీజ, దీపిక, సిగ్ధ, అనన్య, వేదవ్రిద్ధ, శ్రేయ ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



బాస్కెట్‌బాల్ టోర్నీకి స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. క్రీడాకారులకు బస, భోజన వసతికి కల్పిస్తున్నాం. ఫ్లడ్ లైట్ల వెలుగులో మ్యాచ్‌లు ఉంటాయి. టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

- పాపిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్-19, జిల్లా సెక్రటరీ

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి
- టోర్నీకి తరలిన బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్లు



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా జట్లు విజే తగా నిలవాలని ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి సూచించారు. మెదక్, హైదరాబాద్‌లో జరగనున్న బాస్కెట్‌బాల్, సిద్దిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. గురువారం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. టోర్నీ ప్రతిభ చాటి జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో జియావుద్దీన్, ఉస్మాన్ పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-19 ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల మినీ స్టేడియంలో ఎంపికలు ఉంటాయని, ఉదయం 9 గంటలకు పదో తరగతి మెమో జిరాక్స్, ఒరిజినల్ బోనఫైడ్‌తో హాజరుకావాలని కోరారు.



పూజలు చేస్తున్న సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

కొండారెడ్డిపల్లిలో వైభవంగా పూజలు

- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు

వంగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య హోమ పూజలు నిర్వహించారు. సీఎం సోదరులు కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. ముత్యాల లక్ష్మారెడ్డి, వేమారెడ్డి, లాలు యాదవ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కూలీకి వెళ్తున్న బాల కార్మికుల విముక్తి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు

లింగాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు మానేసి పత్తి చేను పనులకు వెళ్తున్న బాల కార్మికులను విముక్తి కల్పించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద చైల్డ్ హెల్ప్‌లైన్, కోనేరు ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఆటోలను తనిఖీ చేశారు. అందులో 18ఏళ్ల లోపు ఆరుగురు పిల్లలను విముక్తి కల్పించి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి అక్కడ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వై.లక్ష్మణ్‌రావు, కమిటీ సభ్యులు ప్రసన్న, ఎల్లప్ప, లక్ష్మయ్య మాట్లాడుతూ.. పిల్లలు పాఠశాలలో ఉండాలని, ఇక నుంచి పత్తి చేను పనులకు తీసుకెళ్తే ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చైల్డ్‌హెల్ప్ లైన్ 1098 ప్రమీల, కానిస్టేబుల్ ఉశన్న, కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అంజనేయులు, అడిషనల్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

అట్టహాసంగా ముగిసిన హాకీ టోర్నమెంట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో(అండర్-17) మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ పర్యవేక్షణలో ఉత్కంఠభరితంగా సాగిన టోర్నమెంట్‌లో చివరి రోజు మొదటి స్థానంలో ఆదిలాబాద్, రెండో స్థానంలో నల్గొండ, మూడో స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్లు విజయం సాధించాయి. వీరికి డీఈవో, లింగా ఫౌండేషన్ డైరెక్టర్ ఉషారాణి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, విజయం దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాష్‌గౌడ్, రామకృష్ణ, శర్ఫోద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, రాజాగౌడ్, శివకుమారి, హోప్ ఆస్పత్రి ఎం.డీ. డా.కృష్ణమూరి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

పీయూలో ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక



ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎంపికైన ఆర్చరి క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో ఆర్చరీ మహిళల, పురుషుల విభాగంలో క్రీడాకారులను గురువారం పీయూ ఇండోర్ స్టేడియంలో ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు యూనివర్సిటీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి పీయూ పీడీలు, కోచ్‌లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని ఎంపిక చేశారు. క్రీడాకారులు మంచి ప్రదర్శన కనపరిచి విజయం సాధించాలని ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ సూచించారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఒడిశాలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సటీ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ హరిబాబు, ఆర్చరీ కోచ్ జానేశ్వర్, శ్రీనివాస్, రాంచందర్, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



గ్రామస్థులతో సమావేశమైన కేంద్ర బృందం

నవాబ్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ప్రభుత్వ పనుల సందర్శనకు వచ్చిన కేంద్ర బృందానికి కూలీలు, రైతులు మొరపెట్టుకున్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని తీగలపల్లి, తిమ్మయ్యపల్లిలలో రాత్రి వరకు పర్యటించారు. సభ్యులు ముత్తకుమార్, డాక్టర్ దేవన్,ఉపాధి హామీ, నేషనల్ పెన్షన్ పథకం, పంచాయతీ రాజ్, పంచాయతీల పనితీరు, మహిళా సంఘాల నిర్వహణ అంశాలపై చర్చించారు. పలువురు రైతులు ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింహులు, అదనపు డీఆర్‌డీవో మూసాయిదాబేగం, ఏపీడీ శ్రీపాద, ఎంపీడీవో జయరాములు, కార్యదర్శి నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

నాన్నే స్ఫూర్తి!

(మొదటి పేజీ తరువాయి)



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

ఉంటుంది. నా వృత్తిగత జీవితంలో ఎక్కువగానే కన్విక్షన్లు సాధించాను. అయితే అత్యంత ఎక్కువగా మనం చేసిన పనులు ఇప్పటికీ చాలామందికి గుర్తుంటాయి. మేడం సాయం చేయగలుగుతారు అని ఇప్పటికీ మన వద్దకు వచ్చేవారిని చూస్తే చాలా సంతోషంగా ఉంటుంది. నేను పనిచేసిన ప్రాంతాల్లో వ్యక్తులు తరచూ మాట్లాడతారు. గుర్తు పడతారు.

యువతకు, ఉద్యోగార్థులకు మీరిచ్చే సూచనలు?

యువత మొదట ఆత్మనూన్యతను వీడాలి. అలాగే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. మనతో ఇది సాధ్యమవుతుందా?.. లక్ష్యం చేరుకోగలుగుతామా?.. తక్కువ పోస్టులు ఉన్నాయి కదా, మనకు వస్తుందా? అనే ఆలోచనలు వీడాలి. మీరనుకున్న లక్ష్యం కోసం కష్టపడి పనిచేస్తే సులభంగా చేరుకుంటారు. ముఖ్యంగా అమ్మాయిలు అసలు నూన్యతకు గురికావొద్దు. ఎంచుకున్న దారిలో ముందుకు వెళ్లాలి. చిన్నచిన్న విషయాల పట్ల క్షణికావేశానికి గురవ్వొద్దు. ఏ పని చేసినా, ఏ ఉద్యోగం వచ్చినా కమిట్‌మెంట్‌తో పనిచేయాలి. అప్పుడు జీవితం చాలా సంతృప్తిగా ఉంటుంది.

నేరాల తీరు.. కట్టడి ఎలా ఉంది?

గతంతో పోలిస్తే నేరాల తీరు పూర్తిగా మారిపోయింది. సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. చదువుకున్న వారే అత్యాశతో సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. డిజిటల్ అరెస్టులకు ఒక వ్యక్తి భయపడి, లక్షల్లో డబ్బులు ముట్టజెప్పారు. ప్రతీ వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్ ఉంది. అదే మెజారిటీ నేరాలకు కారణమవుతోంది. ఏదైనా సైబర్ క్రైం జరిగిందని తెలిసిన వెంటనే 1930కి కాల్ చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. కాలేజీల్లో క్యాంపులు నిర్వహిస్తున్నాం. సీనియర్ సిటిజన్స్‌కి కూడా సైబర్ నేరాల తీరుపై క్షుణ్ణంగా వివరిస్తున్నాం. అలాగే సీసీ కెమెరాలు సాధ్యమైనన్ని ఎక్కువగా పెట్టిస్తున్నాం.

రోడ్డు ప్రమాదాలు, గంజాయిని అరికట్టడం, ట్రాఫిక్ నివారణపై చర్యలు ఎలా ఉన్నాయి?

గంజాయి ఎక్కడా పెద్ద మొత్తంలో సరఫరా కావడం లేదు. చిన్న చిన్న మొత్తాల్లో ఎక్కడో ఒకచోట పట్టుబడుతోంది. దాని నివారణకు కూడా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కాలేజీలు, ఊరు బయట ఓపెన్ ప్లేస్‌లు, పాత భవనాల వద్ద పెట్రోలింగ్‌ను పెంచడం జరిగింది. పాఠశాలల్లో కూడా అవగాహన క్యాంపులు చేపడుతున్నాం. ఇక్కడ అంత పెద్దగా ఈ సమస్య లేదనే చెప్పొచ్చు. ఇక రోడ్డు ప్రమాదాలు గతంతో పోల్చితే బాగా తగ్గాయి. గత నెల కంటే ఈ నెలలో కూడా తరుగుదల ఉంది. బ్లాక్ స్పాట్స్‌ను విజిట్ చేస్తున్నాం. అందరితో కో ఆర్డినేట్ చేస్తున్నాం. నిర్మానుష్య ప్రాంతాల వద్ద సమస్య కొంత ఎక్కువగా ఉంటోంది. స్టడ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఇక ట్రాఫిక్‌కు సంబంధించి ఫుట్‌పాత్‌లపై కుండీలు పెడుతున్నారు. వాటిని తొలగించినా మళ్లీ అక్కడే పెడుతున్నారు. సిగ్నల్స్ విషయంలో మునిసిపాలిటీ వారు వాటిని పనిచేసేలా చూడాలి. జడ్చర్ల ట్రాఫిక్ పీఎస్, మూడో పట్టణ పోలీస్ స్టేషన్, ఇంకా కొత్త ఠాణాలు ప్రతిపాదనలు ఉన్నాయి.

మహబూబ్‌నగర్‌కు వచ్చిన తర్వాత వేగంగా ట్రేస్ చేసిన కేసులు?

ఇటీవల జడ్చర్ల బస్టాండ్‌లో యూపీకి చెందిన ముగ్గురు వ్యక్తుల ముఠా ఒక ప్రయాణికుడి నుంచి రూ. 34 లక్షలను దొంగతనం చేశారు. సీసీ ఫుటేజీని పట్టుకుని హైదరాబాద్ వరకు వెళ్లడం జరిగింది. దాన్ని యూపీ గ్యాంగ్‌గా గుర్తించి, ఆ రాష్ట్రానికి టీంను పంపించడం జరిగింది. దాదాపు రూ.30 లక్షల వరకు రికవరీ చేయగలిగాం. ఈ కేసును 15 నుంచి 20 రోజుల సమయంలోనే వేగంగా పూర్తిచేశాం. అలాగే ఇటీవల ఐటీసీ గోదాం నుంచి రూ.32 లక్షల విలువ చేసే 32 కాటన్ల సిగిరెట్లను దొంగిలించారు. వారిని కూడా వేగంగా పట్టుకున్నాం. ఏ శాఖలోనైనా సమష్టి కృషి చాలా అవసరం. ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు, అనుబంధంగా పనిచేసే అందరి సహకారంతో పనిచేస్తున్నాం. ఈ కేసు అయినా చాలెంజ్‌గా తీసుకుని టీం వర్క్‌తో పని చేస్తే ఫలితాలు కూడా వేగంగా వస్తాయి.

హత్యా? రోడ్డు ప్రమాదమా?

- కూతురి మృతిపై తండ్రి అనుమానం
- బైక్‌పై నుంచి పడి మృతి చెందిందన్న భర్త
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


శేషమ్మ (ఫైల్)

గద్వాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలం గోనుపాడు గ్రామానికి చెందిన శేషమ్మ (31) గురువారం రింగ్‌రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అయితే భర్తే హత్య చేశాడని మృతురాలి తండ్రి సుంకన్న ఆరోపిస్తుండగా, ద్విచక్రవాహనంపై నుంచి పడి మృతి చెందిందని భర్త రామకృష్ణ చెప్తున్నాడు. సంఘటనకు సంబంధించి మృతురాలి తండ్రి, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎర్రవల్లి మండలం, బట్లదిన్నె గ్రామానికి చెందిన సుంకన్న కుమార్తె శేషమ్మకు 2016లో గోనుపాడు గ్రామానికి చెందిన రామకృష్ణతో పెళ్లి చేశారు. ఆమెను గత కొన్నేళ్లుగా భర్త అనుమానిస్తూ కొట్టేవాడు. విడాకులు ఇవ్వాలని, లేదంటే చంపేస్తానని బెదిరించేవాడు. పలుమార్లు పంచాయితీ పెట్టి, నచ్చ చెప్పినా అల్లుడిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో గురువారం ఇద్దరం బైక్‌పై గోనుపాడు నుంచి గద్వాల రింగ్ రోడ్డుపై వెళ్తుండగా కుక్క అడ్డు వచ్చిందని, దీంతో శేషమ్మ కిందపడి మృతి చెందిందని రామకృష్ణ మామ సుంకన్నకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు ఆసుపత్రికి వెళ్లి చూశారు. తమ కుమార్తె నుదిటిపై గాయం ఉందని, అల్లుడికి గాయాలు కాలేదని, బైక్ కూడా బాగానే ఉందని సుంకన్న పోలీసులకు తెలిపారు. రింగు రోడ్డు నిర్మానుష్యంగా ఉండటంతో నుదిటిపై కొట్టి చంపేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం వచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

- అయ్యప్ప మాల వేసుకునేందుకు వెళ్తుండగా ప్రమాదం
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ధర్నా
- నల్గొండ జిల్లా, దేవరకొండ పట్టణంలో ఘటన

దేవరకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి మాల వేసుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన ఆవాంచ శేఖరాచారి(46)కి దేవరకొండకు చెందిన అలివేలుతో వివాహం అయ్యింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఈనెల ఆరున అయ్యప్పమాల వేసుకునేందుకు శేఖరాచారి పెద్ద కుమారుడు జగదీష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై అయ్యప్పస్వామి దేవాలయానికి బయలుదేరాడు. ఆలయం సమీపంలోకి చేరుకోగానే, వెనుక నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో శేఖరాచారికి తీవ్ర గాయాలయ్యాయి. జగదీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శేఖరాచారిని మొదట దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి ఓఎఐ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం యజమానిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

ఖాతాలో డబ్బులు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మేసేజ్ ఓపెన్ చేస్తే రూ. 71 వేలు మాయమయ్యాయి. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్ డిపోలో పని చేస్తున్న సురేందర్ గత నెల రెండవ తేదీన తన ఫోన్‌కు మేసేజ్ రావడంతో ఓపెన్ చేశాడు. వెంటనే తన ఖాతాలో నుంచి రూ. 71 వేల రూపాయలు కట్ అయ్యాయి. ఈ సంఘటనపై వెంటనే సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి, నేరస్తుల ఖాతాలో ఉన్న రూ. 39 వేలను సీజ్ చేశారు. సంఘటనపై బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోవర్ధన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుంచి ఏ మేసేజ్‌లు వచ్చినా ఓపెన్ చేయవద్దని సూచించారు. అనుమానిత లింకులను క్లిక్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని కోరారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ కుటుంబం బ తుకుదెరువు కోసం నగరానికి వచ్చి అత్తాపూర్‌లో స్థిరపడింది. ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో నివసిస్తున్నారు. అతడికి ఇద్దరు కుమారు లు. పెద్ద కుమారుడు ఆనంద్‌కుమార్‌కు వివాహమైంది. చిన్న కుమారుడు సాయికుమార్19) చదువుకుంటూ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు. కొంతకాలం క్రితం శ్రీనివాస్ మరణించడం తో ఆయన భార్య, చిన్న కుమారుడు సాయికుమార్ అత్తాపూర్‌లో పెద్ద కుమారుడితో కలిసి ఉంటున్నారు.

బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికుమార్ తొమ్మిది గంటలు అయినా ఇంటికి రాలేదు. ఆనంద్ ఫోన్ చేయగా.. వస్తున్నానని చెప్పాడు. ఎంతసేపైనా సాయికుమార్ ఇంటికి రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వారి ఇంటి పక్కన నివసిస్తున్న మామ శ్రీనివాస్ ఊరికి వెళ్తూ ఇంటి తాళాలు ఇచ్చాడు. తమ్ముడు అక్కడ ఉన్నాడేమోనని ఆనంద్ వెళ్లి చూడగా.. సాయికుమార్ ఇంట్లో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. దీంతో అతడు వెంటనే అత్తాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవదేవుడికి.. దళితుల సేవ



- చిన్న వడ్డెమాన్‌లో ఉద్దాలను సిద్ధం చేస్తున్న దళితులు
- దీపావళి అమావాస్య నుంచి తయారీ ప్రారంభం
- పని పూర్తయ్యే వరకు రెండు పూటలా స్నానం, ఒంటి పూట భోజనం
- ఉద్దాలను దర్శించుకున్న తర్వాతే స్వామి సన్నిధికి భక్తులు


చిన్న వడ్డెమాన్ గ్రామంలో ఉద్దాల తయారీలో నిమగ్నమై ఉన్న దళితులు

చిన్నచింతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేవదేవుడైన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి సేవలో దళితులు తరాతరాలుగా తరిస్తున్నారు. మహబూబ్ నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలో అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో తొలి ఘట్టమైన అలంకారోత్సవం ఈనెల ఆరున ముగిసింది. ఆ తర్వాత ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవం ఈ నెల ఎనిమిదిన జరుగనున్నది. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవం కోసం ఉద్దాలను (పాదుకలు) చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డెమాన్‌కు చెందిన దళితులు సిద్ధం చేస్తున్నారు.

నియమ నిష్టలతో ఉద్దాల తయారీ

ఆనవాయితీ ప్రకారం చిన్న వడ్డెమాన్ గ్రామంలోని ప్రత్యేక గదిలో దీపావళి అమావాస్య రోజు ఉద్దాల తయారీ ప్రారంభం అయ్యింది. గ్రామానికి చెందిన 60 మంది దళితులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమాన్ని వారు అత్యంత నియమ నిష్టలతో కొనసాగిస్తారు. రోజుకు ఒక్క సారి మాత్రమే భోజనం చేస్తారు. రెండు పూటలా స్నానం చేస్తారు. ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచి గ్రామ సమీపంలోని ఊక చెట్టు వాగులో పవిత్ర స్నానం చేస్తారు. అనంతరం గ్రామంలోని ఉద్దాల తయారీ గదికి చేరుకుంటారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, పని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భోజనం చేస్తారు. ఆ తర్వాత కొంత సేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ పని ప్రారంభిస్తారు. రాత్రి తొమ్మిది గంటల వరకు పనిలోనే ఉంటారు.

ఏడాది పాటు మండపంలోనే ఉద్దాలు

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఆ ఒక్క రోజే దాదాపు నాలుగు లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారు. భక్తులు మండపంలోని ఉద్దాలను దర్శించుకొని, ఆశీర్వాదం తీసుకున్న తర్వాతే స్వామి వారి దర్శనానికి వెళ్తారు. అక్కడ దళితులే వంతుల వారీగా సేవలు అందిస్తారు. ఉద్దాలతో తలపై కొట్టించుకుంటే అనారోగ్య బాధలు, కుటుంబంలో అశాంతి తొలగిపోయి, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఏడాది పాటు ఆ ఉద్దాలను మండపంలోనే ఉంచుతారు.

ఉద్దాలపై ఆసక్తికరమైన కథనాలు

ఉద్దాలోత్సవానికి సంబంధించి రెండు మూడు కథనాలు ప్రచారంలో ఉంది. కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మొట్టమొదటి సారిగా క్రీస్తుశకం 1265వ సంవత్సరంలో ప్రారంభం అయ్యాయి. ఆ సమయంలో వడ్డేమాన్, అమ్మాపూర్ సంస్థానాలను ఇమ్మడి తిమ్మారెడ్డి వంశస్తులు పరిపాలించే వారు. ఓ ఏడాది బ్రహ్మోత్సవాలకు రెండు నెలల ముందు కురుమూర్తి కొండల్లో ఒక ఆవును పులి చంపింది. ఈ విషయాన్ని చిన్న వడ్డెమాన్‌కు చెందిన దళితులకు స్వామి వారు కలలో కన్పించి తెలిపారు. ఆ ఆవు చర్మాని తీసుకొచ్చి తనకు పాదుకలు తయారు చేయాలని ఆదేశించారు. దీంతో వారు వాగులోని ఇసుకను తెచ్చి ఓ గదిలో కుప్పగా పోసి పూజలు చేశారు. కార్తీక అమావాస్య రోజు అర్ధరాత్రి సమయంలో స్వామి వచ్చి తన పాదాలను ఆ ఇసుకలో మోపి వెళ్లి పోయారు. ఆ ముద్రల ఆధారంగా వారు ఉద్దాలను తయారు చేశారు.

అలాగే మరో కథనం కూడా ఉంది. కృష్ణానది తీరాన స్వామి వారు విశ్రమించిన వ్పుడు ఆయనకు పాదరక్షలు లేకపోవడాన్ని గంగమ్మ గమనించింది. స్వామి వారికి ఉద్దాలను సమర్పించింది. ఆ తర్వాత స్వామి చిన్న వడ్డెమాన్‌కు చేరుకొని తనకు ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్దాలను తయారు చేయాలని గ్రామస్థులను కోరారు. అందుకు దళితులు అంగీకరించారు. అప్పటి నుంచి ఆ పనిని కొనసాగిస్తున్నారు. వాటిని తయారు చేసేందుకు ఆవు చర్మం, వన్నెలాకు, తగరం, పచ్చపూజలు, ట్విన్ దారం, మైనం, రేషం పట్టు తదితర సామగ్రిని వినియోగిస్తారు.

తాతల కాలం నుంచి సేవ



నిరంజన్, ఉద్దాల తయారీదారు : మా తాతల కాలం నుంచి స్వామి వారి సేవలో ఉన్నాం. దీపావళి అమావాస్య నుంచి నియమ నిష్టలతో స్వామివారి ఉద్దాలను తయారు చేస్తాం. నాతో పాటు దాదాపు 60 మంది ఉద్దాల తయారీలో పాల్గొంటారు.

దేవదేవుడు ఇచ్చిన వరం



దశరథ, ఉద్దాల తయారీదారు : కురుమూర్తి రాయుడికి ఉద్దాలను తయారీలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. తమ పూర్వీకుల కాలం నుంచి ఈ పనిని కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులోనూ స్వామి వారికి సేవలు అందిస్తూనే ఉంటాం. ఇది మాకు దేవుడు ఇచ్చిన వరం.

హైదరాబాద్ నుంచి వచ్చాను



జాన్, దళితుడు, ఉద్దాల తయారీదారు : ఉద్దాల తయారీలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాను. మా తాత ముత్తాతల కాలం నుంచి కురుమయ్యకు ఉద్దాలను తయారు చేస్తున్నారు. ఆ ఆనవాయితీని కొనసాగించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

నాసిరకం సరకులు సరఫరా చేయొద్దు

- పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి
- మహిళల వసతి గృహం ఆకస్మిక తనిఖీ


వసతిగృహం సిబ్బందితో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

నవంబరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాసిరకం సరకులను సరాఫరా చేస్తే టెండర్లను రద్దు చేస్తామని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. యూనివర్సిటీలోని మహిళల వసతి గృహన్ని గురు వారం అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు, తాగునీరు, వంటలు, కాంట్రాక్టర్లు సరఫరా చేసిన సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నూతన వసతి గృహంలోని గదులకు నెంబర్లు వేయాలని సూచించారు. వాటిని సీనియర్ విద్యార్థులకు వెంటనే కేటాయించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ నూర్జహాన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కృష్ణయ్య, వార్డెన్లు మాధవీ మోహన్, కల్పన, కేర్ టేకర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రెనివట్ల గ్రామాన్ని మునిసిపాలిటీలో కలుపొద్దు'

మద్దూర్, నవంబర్ 07(ఆంధ్రజ్యోతి) : తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న మద్దూర్ మునిసిపాలిటీలో కలుపొద్దని నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని రెనివట్ల గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మునిసిపాలిటీలో కలిపితే ఎన్నో విధాలుగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో గ్రామస్థులు నారాయణ, శంకర్, వెంకటప్ప, గోవిందు, యండీ.హజర్, పకీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు అవినీతి చెద

(మొదటి పేజీ తరువాయి)

పదోన్నతి అయినా, డిప్యూటేషన్ అయినా, సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలన్నా, ప్రైవేట్ పాఠశాల అనుమతి కావాలన్నా ఆయన చేయి తడపాల్సిందే. అది కూడా రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేస్తారన్న ప్రచారం సాగుతోంది. తన పోస్టు కోసం రూ.8 లక్షలు ఖర్చుపెట్టానని, మరి ఆ డబ్బులు ఎలా వసూలు చేసుకోవాలని బహిరంగంగానే ఆ అధికారి మాట్లాడటం గమనార్హం. ఎస్‌జీటీగా ఉన్న తన భార్య పిల్లలమర్రి సమీపంలోని ఎర్రవల్లి తండాలో పని చేస్తుండగా, డీఈఓ అయిన తరువాత ఆమెను తన ఇంటి పక్కన ఉన్న పాఠశాలకు డిప్యుటేషన్‌పై తెచ్చుకున్నారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా, ఫిర్యాదులు చేసినా డోంట్ కేర్ అన్నట్లుగా రెండేళ్లుగా వ్యవహారం నడిపిస్తున్నారంటే డీఈవో ఏ స్థాయిలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారో అర్థం అవుతోంది.

వెల్లువెత్తుతున్న ఆరోపణలు

రవీందర్ వనపర్తి డీఈవోగా పని చేస్తున్న సమయంలో విద్యార్థి సంఘాలు ఈయన అవినీతిపై పెద్ద ఎత్తున ఆరోపణలు చేశాయి. కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్, ఆర్‌జేడీకి కూడా ఫిర్యాదులు చేశారు. విద్యాశాఖలో ముఖ్యంగా ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి పెద్ద ఎత్తున పైరవీలు సాగుతాయి. బదిలీలు, డిప్యుటేషన్ విషయంలో పైరవీలు ఉంటాయి. ఈ క్రమంలో డీఈవో ప్రతీ పనికి డబ్బులు తీసుకుని, నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇస్తే ఏ పనైనా చేస్తారన్న స్థాయికి విద్యాశాఖను తెచ్చారన్న ప్రచారం సాగుతోంది. డీఈవోపై ఏసీబీ దాడి చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులకు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. డీఈవోను పట్టించిన ఉపాధ్యాయురాలు ఎవరని తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. ఇన్నాళ్ళకు ఆ ఉపాధ్యాయురాలు ధైర్యం చేసిందన్న చర్చ సాగింది.

కోర్టు ఆదేలిచ్చినా డబ్బులు వసూలు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లుగా కోర్టులు ఆదేశించినా అమలు చేయడానికి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన అధికారి పాపం ఎట్టకేలకు పండిందన్న ప్రచారం సాగుతోంది. గురువారం ఏసీబీని ఆశ్రయించిన ఉపాధ్యాయురాలి విషయంలో ఇదే జరిగింది. తనకన్నా జూనియర్ అయిన వారికి పదోన్నతి కల్పించి, తనకు ఇవ్వకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినా.. పదోన్నతి ఇవ్వడంకోసం రూ.లక్షన్నర వసూలు చేశారు. ఆ తరువాత అదే ఉపాధ్యాయురాలికి సీనియారిటీ జాబితాలో తనకన్నా జూనియర్‌కు అవకాశం ఇచ్చి, ఆమెకు చోటు కల్పించ లేదు. దాంతో మరోసారి ఆమె కోర్టును ఆశ్ర యించాల్సి వచ్చింది. కోర్టు మరోసారి ఆమె పక్షాన ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలు తీసుకుని ఆమె డీఈవోను కలిసింది. మళ్లీ డీఈవో రూ.లక్ష డిమాండ్ చేయడంతో రూ.50 వేలకు ఒప్పందం చేసుకున్నారు. అప్పటికే రూ.లక్షన్నర తీసుకుని, మళ్లీ డబ్బులు డిమాండ్ చేస్తున్న అధికారి తీరుకు విసుగు చెందిన ఉపాధ్యాయురాలు ఏసీబీని ఆశ్రయించింది. దాంతో అవినీతి అధికారి ఆగడాలకు చెక్ పెట్టినట్లైంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మద్దూర్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ రాంలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన పద్మమ్మ(45)కు ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త చనిపోవడంతో కుటుంబ భారాన్ని ఆమె మోసేది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె తాగుడుకు బానిసయ్యింది. ఈ నెల ఒకటిన ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఆ సమయంలో పని మీద బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆమె విలవిల్లాడుతోంది. దీంతో కుమార్తె రేణుక, అల్లుడు మోహన్ ఆమెను మద్దూర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి అయ్యప్పస్వామి మృతి

హన్వాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని టంకర గ్రామానికి చెందిన మంగలి అంజనేయులు (28) గురువారం బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంజనేయులు వారం రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించాడు. ఆయనకు కల్లు తాగే అలవాటు ఉండేది. కానీ మాల ధరించినందున కల్లు తాగలేదు. దీంతో నాలుగు రోజుల నుంచి అతడి మానసిక పరిస్థితి దెబ్బతిన్నది. ఈ పరిస్థితుల్లో ఇంటి పక్కనున్న బావిలో దూకాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి బావిలో గాలించారు. కానీ బావి పెద్దగా ఉండటం, ఎక్కువ నీరు ఉండటంతో మృతదేహం లభించలేదు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో 20 మేక పిల్లలు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఊర కుక్కల దాడిలో 20 మేక పిల్లలు మృతి చెందాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన కురువ లక్ష్మయ్య తన ఇంటి ఆవరణలో మేక పిల్లలను ఉంచి మేకలను మేపేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఊర కుక్కలు మేక పిల్లలపై దాడి చేశాయి. గమనించిన చుట్టు పక్కల వారు లక్ష్మయ్యకు సమాచారం అందించడంతో ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే 20 మేక పిల్లలు చనిపోయి ఉన్నాయి.

322 క్వింటాళ్ల ధాన్యం పట్టివేత


పట్టుబడిన ధాన్యం లారీ

నారాయణపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీని నారాయణపేట పోలీసులు పట్టుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి నుంచి హైదరాబాద్‌కు ధాన్యం బస్తాలతో వెళ్తున్న లారీని నారాయణపేట మండలం జిలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు ఆపారు. కానీ డ్రైవర్ అంజయ్య లారీని ఆపకుండా వెళ్లడంతో కొద్దిదూరం వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా ధాన్యం బస్తాలు కన్పించాయి. డ్రైవర్‌ను విచారించగా, పొంతన లేని సమా ధానాలు ఇచ్చాడు. వే బిల్లులు లేకపోవడంతో ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. లారీలో 460 బస్తాల 322 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం ఉన్నట్లు సివిల్ సప్లై డీటీ కాళప్ప ధృవీకరించారు.

పోలీసు బందోబస్తు మధ్య రామాలయ భూమి సర్వే

- వాదోపవాదాల మధ్య హద్దుల గుర్తింపు


ఆలయ భూమిలో హద్దులను గుర్తిస్తున్న అధికారులు

అమ్రాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలోని కోదండ రామాలయం భూముల సర్వే వాదోపవాదాల మధ్య కొనసాగింది. ఈ భూములకు సంబంధించిన హద్దుల గుర్తింపు విషయంలో వివాదం కొనసాగుతోంది. 1330 సర్వే నంబర్‌లో 15 ఎకరాల 22 గుంటల భూమి ఉందని, అందులో దాదాపు రెండు ఎకరాలకు పైగా భూమిని ఇతరులు ఆక్రమించారు. ఈ విషయంపై పూజారి, ఆలయ కమిటీ పెద్దలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డివిజనల్ సర్వే అధికారి సుదర్శన్ బాబు ఆధ్వర్యంలో గురువారం పోలీసు బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే కొనసాగింది. ఈ క్రమంలో హద్దుల గుర్తింపు విషయంలో ఆలయ భూమి పక్కనే వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమిలో హద్దులు పెట్టాల్సి రావడంతో కొందరు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య కొంత సేపు వాగ్వివాదం జరిగింది. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ రజిత జోక్యం చేసుకొని వక్ఫ్‌బోర్డు నుంచి కూడా సర్వే చేయించుకోవచ్చని వారికి నచ్చచెప్పారు. అనంతరం సర్వే పూర్తి చేసి, హద్దులను గుర్తించారు.

ఇంటర్వ్యూ..



పాడిరైతులకు అందుబాటులో ఉంటున్నాం

- మండల పశువైద్యాధికారి శివరాజ్

మిడ్జిల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని రైతులకు, పాడిరైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పశువైద్యశాల ఆధ్వర్యంలో అన్నివిధాలా చర్యలు చేపడుతున్నామని మండల పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో పలువిషయాలను ఆయన వివరించారు.

మండలంలోని ఏయే జీవాలు ఎన్ని ఉన్నాయి?

మండలంలోని పశువైద్య శాఖ లెక్కల ప్రకారం మొత్తం గేదెలు 3400, ఆవులు, ఎద్దులు 7,348, గొర్రెలు 22 వేలు, మేకలు 3400 ఉన్నాయి.

నట్టల నివారణ మందులు అందుబాటులో ఉన్నాయా?

మండలంలోని పశువైద్యశాలలో ప్రస్తుతం నట్టల నివారణ మందులు అందుబాటులో లేవు. నట్టల నివారణ మందులు లేక సంవత్సరం కావస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తే బాగుంటుంది.

ఇప్పటివరకు ఎన్ని గ్రామాలలో క్యాంపులు నిర్వహించారు?

కొన్ని గ్రామాలలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని మొదట పెద్దగుండ్లతండా, మల్లాపూర్ గ్రామాలలో క్యాంపులు వేసి 37 ఆవులకు చికిత్స చేయించాము.

మసూచి వ్యాధి బారినపడి గొర్రెలు, మేకల కాపరులు ఇబ్బందు లుపడ్డారు కదా?

మసూచి వ్యాధి సోకిన ఆరువేల గొర్రెలు, మేకలకు టీకాలు వేశాము. విషయం తెలిసిన వెంటనే మందులు సిద్ధం చేసుకుని కాపరులతో మాట్లాడి వేశాము.

కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందా?

మండలంలోని పశువైద్యశాలతో పాటు సబ్‌సెంటర్‌లలో ఎనిమిది మంది సిబ్బందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం కొత్తపల్లి, బోయిన్‌పల్లి గ్రామాల సబ్ సెంటర్‌లలో ఒక్కొక్క సబార్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

న్యూస్ బాక్స్

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన పీడీ

హన్వాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో వోఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని గురువారం డ్వామా పీడీ నర్సిములు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టానాయక్, దస్తయ్య, బాలకిష్టమ్మ, సంస్థ సభ్యులు నారాయణ, రాములు, మల్లమ్మ, రాధ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి: టీడీపీ

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాత కలెక్టర్ ప్రాంగణంలో తొలిగించిన మాజీ ముఖ్యమంత్రి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి కోరుతూ స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. గతంలో కలెక్టర్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఉండేదని కాని ఈ విగ్రహాన్ని గత ప్రభుత్వం తొలిగించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ 100రూపాయల నాణ్యం విడుదల చేసిందని అన్నారు. కనుక ప్రజాప్రతినిధులు అధికారులు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా జిల్లా చెస్ జట్ల ఎంపికలు

- పోటీలను ప్రారంభించిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్కాలర్స్ స్కూల్ జిల్లా అండర్-14, 17 చెస్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ అండర్-17 కార్యదర్శి శారదాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతున్నదని, చెస్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లాకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన అదృశ్యమైన వ్యక్తి

మిడ్జిల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగొమ్ముల గ్రామానికి చెందిన యువకుడు బంగారు, ఇంట్లో సమాచారం ఇవ్వకుండా మంగళవారం వెళ్లిపోగా.. కుటుంబసభ్యులు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం బంగారు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లి, తిరిగి గురువారం ఇంటికి వచ్చాడని గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపారు. ఎవరికీ చెప్పకుండా వెళ్లడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంగారు రాకతో సంతోషం వ్యక్తం చేశారు.

సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

- రాజాపూర్, నవాబ్‌పేట మండలాల్లో సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్



రాజాపూర్‌లో సర్వే వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

రాజాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని, పక్కాగా వివరాలు సేకరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎంపీడీవో మచ్చేందర్, ఉప తహసీల్దార్ భారతి, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిని సందర్శించాలి

నవాబ్‌పేట: గ్రామాలు, పట్టణాల్లో సమగ్ర ఇంటింటి సర్వేలో ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం మండలంలోని ఇప్పటూర్, కారూర్ గ్రామాలను తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ వార్డు కోడ్, బ్లాక్ తదితర కోడ్ నమోదు తర్వాత ఈనెల 9నుంచి సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎన్యుమరేటర్ వద్ద ఉన్న స్టిక్కర్, మ్యాప్, ఐడీకార్డు, ఇతర ఫారాలను పరిశీలించారు. వివరాల సేకరణ కలెక్టర్‌కు ఎన్యుమరేటర్లు వివరించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఫాంపాండ్‌లు, అండర్ పైపులైన్‌ల ధ్వంసం



పోలేపల్లి శివారులో అక్రమ ఫాంపాండ్‌లను యంత్రాలతో పూడ్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం పోలేపల్లి పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ క్షేత్రాలలో అక్రమంగా నీటివ్యాపారం కోసం నిర్మాణం చేసుకున్న ఫాంపాండ్‌లు, అండర్ పైపులైనులను గురువారం రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ బృందం తనిఖీలు చేపట్టి, అక్రమంగా నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారని, నీటి వ్యాపారానికి విద్యుత్‌ను సైతం అక్రమంగా వినియోగిస్తున్నారంటూ గుర్తించడంతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఫాంపాండ్‌లు, అండర్ పైపులైను నిర్మాణాల ధ్వంసం చేస్తున్న పనులను రెండోరోజు సైతం కొనసాగించారు. మాజీ సర్పంచ్ ఇంటి నుంచి పోలేపల్లి సెజ్‌లోని హెటిరో ఫార్మ పరిశ్రమకు అండర్ పైపులైన్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పైపులైనులను ఎక్స్‌కవేటర్‌లతో తొలగించారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులతో పాటు గ్రామానికి చెందిన మరికొందరు పోలేపల్లి శివారులో అక్రమ నీటి వ్యాపారానికి నిర్మాణం చేసుకున్న ఫాంపాండ్‌లను ఎక్స్‌కవేటర్‌లతో ధ్వంసం చేశారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు



కోడ్గల్‌లో రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు అందజేశారు. జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతులకు గురువారం 120 ఎకరాలలో పంటను పండించుకునేందుకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. సాగులో శాస్త్రీయ సలహాలను, సూచనలను ఐసీఏఆర్ లూధియానా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌కె ఝూట్ తెలిపారు. హైదరాబాద్‌లోని పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు సునీల్, నాగేశ్, సౌజన్య, మల్లయ్య పంట పండించుకునే విధానంతో పాటు కీటకాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, ఏడీఏ ఆంజనేయులు, ఏవో గోపీనాథ్, ఏఈఓలు ఏలియా, శేఖర్, భవానీ, నవనీత, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రఘుమారెడ్డి, నర్సిములు, సాయిరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంధుల డబ్బులు తీసుకోవాల్సిన అవసరం వారికి లేదు

- కుట్రపూరితంగానే శ్రీకాంత్‌గౌడ్‌పై కేసు
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



జిల్లా జైలు నుంచి బయటికి వస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరు అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసిన ఉద్యమ నాయకుడు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి అంధుల డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి లేదని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. పేదలకు నకిలీ పట్టాలిచ్చారన్న కేసులో కావాలనే కుట్రపూరితంగా ఇరికించారని ఆరోపించారు. గురువారం జిల్లా జైలులో శ్రీకాంత్‌గౌడ్‌ను పరామర్శించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తహసీల్దార్ రిపోర్ట్‌లో శ్రీకాంత్‌గౌడ్ తప్పుడు పట్టాలు సృష్టించారని ఎక్కడాలేదని, అనామకులు ఆయన పేరు చెప్పారని కేసులో ఇరికించి రిమాండ్ చేస్తారా అని ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారులు నిబంధనల మేరకు పని చేయాలని రేపు మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మీ పరిస్థితి ఏంటో ఆలోచన చేసుకోవాలని సూచించారు.

పాలమూరులో కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలకు తెరతీసిందని విమర్శించారు. అభివృద్ధిపై దృష్టి సారించకుండా కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టించడం, వారిని వేధించడమే పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా వేలకోట్లతో పాలమూరును అన్నిరంగాలలో అభివృద్ధి చేశారని, మీరు వందలకోట్లైనా తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు. అధికారు లు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని అధికారం మారితే మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ యాదయ్య, మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రణీల్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న విగ్రహ స్థాపనకు భూమిపూజ

గండీడ్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న విగ్రహ స్థాపనకు మండలంలోని వెన్నచెడ్ గ్రామంలో గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బొయిన్ గోపాల్ మాట్లాడుతూ పేదల కోసం తన జీవితకాలమంతా పోరాటం చేసిన సాయన్న చరిత్రను ముందు తరాలకు తెలుపాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్మురి నర్సిములు, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, గౌడసంఘం అధ్యక్షుడు చంద్రయ్యకొటాల చెన్నయ్య నాయకులు రాములు, నర్సిములు, ఫులెందర్‌రెడ్డి, వెంకటయ్య, నరెందర్, కాకీ అంజిలయ్య, రాములు, గోపాల్, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

523 సర్వే నెంబర్ బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం ఖలీల్

- టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం ఖలీల్

పాలమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్వేనెంబర్ 523లో ఇంటి స్థలాల పట్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకుని లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇవ్వకపోవటం దారుణమని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం ఖలీల్ ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో 523సర్వే నెంబర్ లబ్ధిదారులు సమావేశమయ్యారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ 2002నుంచి ప్రజలు అలుపెరగని పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. పేదలు అరెస్టు చేయబడి ఏళ్లతరబడి కేసులతో చేసిన పోరాటం తోనే అనేకమందికి ఇళ్ల స్థలాల పట్టాలు వచ్చిన విషయం గుర్తుచేశారు. అనేక వ్యయ ప్రయాసల కోర్చి పేదలు సాధించుకున్న పట్టా సర్టిఫికెట్లను డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని 2018లో అర్బన్ తహసీల్దార్, కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాలతో స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

ఆ పద్ధతిలో 885మంది డబుల్ బెడ్ రూంలకు అర్హులని తేలటం, వారికి నేటికి ఇండ్లు ఇవ్వకపోవటం దారుణమన్నారు. బాధితులకు సంఘీభావంగా తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్ర మంలో ఎడ్ల కృష్ణయ్య, చైతన్య మహిళా సంఘం నాయకురాలు రాజేశ్వరి, జి.గట్టన్న, అజఅస్, జైపాల్, కృష్ణయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయని కేంద్రాలు ఎందుకు?

- బాదేపల్లి మార్కెట్‌లో కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు

జడ్చర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాదేపల్లి మార్కెట్‌లో మూడు రోజుల క్రితం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని, రైతులు తెచ్చిన వరిధాన్యం కొనుగోలు చేయని కేంద్రాలు ఎందుకని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ ప్రశ్నించారు. గురువారం ఆయన కిసాన్ మోర్చ నాయకులతో కలిసి సందర్శించారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించకపోతే మార్కెట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, గోపాల్‌నాయక్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి



కొతలాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కోయిలకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గార్లపాడ్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సింగిల్‌విండో ద్వారా మండలంలోని గార్లపాడ్, మల్కాపూర్, పారుపల్లి, అంకిళ్ల, వింజమూరు, ఎల్లారెడ్డిపల్లి, అనంతాపూర్, చంద్రాసుపల్లి, కొతలాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేశ్, ఎంపీడీవో కాశప్ప, ఏవో రాంపాల్, సింగిల్‌విండో కార్యదర్శి కుమార్ నాయకులు రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, రవి నాయక్, రామస్వామి, సత్యయ్యగౌడ్, విఠల్‌నాయక్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కళకళ

దేవరకద్ర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల నుంచి రైతులు స్థానిక మార్కెట్ యార్డుకు ధాన్యం తేవడంతో మార్కెట్ కళకళలాడుతున్నది. వేలంలో వరి ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠంగా రూ.2,289, కనిష్ఠంగా రూ.1813, పెద్దహంస గరిష్ఠంగా రూ.1,899, కనిష్ఠంగా రూ.1,898 ధర పలికింది. ఆర్‌ఎన్‌ఆర్ 2124 క్వింటాళ్లు, పెద్దహంస 79క్వింటాళ్లు విక్రయానికి వచ్చినట్లు మార్కెట్‌అధికారి తెలిపారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష

జడ్చర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జడ్చర్ల మండలంలోని గంగాపురం, ఆలూరు జడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు పలు పాఠశాలలో చెకుముకి టాలెంట్ పరీక్షలను 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడిఉందని, విద్యార్థులలో సైన్స్ అంశంపై ఆసక్తి పెంచేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయానికి వాటర్‌ట్యాంకు వితరణ



వాటర్‌ట్యాంకును అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మున్సిపాలిటీలోని విద్యానగర్ కాలనీలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి జడ్చర్ల వాసవీ క్లబ్ సభ్యులు వాటర్‌ట్యాంకును అందజేశారు. గురువారం ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి 108ఎ గవర్నర్ బిల్లకంటి జగదీశ్‌గుప్త చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో చంద్రశే ఖర్, ప్రదీప్, రాఘవేందర్, ప్రవీణ్, కృష్ణ, కల్పన, రజిత, వసుంధర, సాయిలీల ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవాబ్‌పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచూర్, కొల్లూర్‌లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా నిలిపివేస్తామని రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం అమ్మిన వెంటనే రైతుకు డబ్బులు

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం



వేపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపూర్, బుద్దారం గ్రామాల్లో గురు వారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వరిధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. ధాన్యం అమ్మిన వెంటనే డబ్బులు ఇస్తున్నామని చెప్పారు. అదేవిధంగా హన్వాడలో నిర్మించే గ్రంథాలయానికి స్థలాన్ని పరిశీలించారు. లింగన్నపల్లిలో కాంగ్రెస్ కార్యకర్త మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలియడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ అనిత, విజయకుమార్, గ్రంథాల య చైర్మన్ నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహెందర్, డైరెక్టర్లు వెంకటాద్రి, రామకృష్ణ, నాయకులు రవి, నవనీత, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

52 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

మహబూబ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్యం అందకుండా ఏ నిరుపేద ప్రాణాలు పోవద్దని ప్రభుత్వం సీఎం సహాయనిధులతో కార్పోరేట్ వైద్యం అందిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద 52 మందికి రూ.16.33 లక్షల చెక్కులను వైద్యం చేయించుకున్న వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కార్ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ పథకంలో 150 ఆసుపత్రులు ఉన్నాయని, త్వరలో మరో 100 ఆసుపత్రిలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా ఎన్నో రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేస్తున్నారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, గ్రంథాలయసంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు షబ్బీర్‌అలీ, ఖాజాపాష, రాశెద్, జాజిమొగ్గ నర్సింహులు, తిరుమల వెంకటేశ్, అంజద్, హనుమంతు, మహేందర్, టంకర కృష్ణయ్య, రాములుయాదవ్ పాల్గొన్నారు.

చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత మాదే

- వర్నెవాగుపై, ఊకచెట్టు వాగుపై బ్రిడ్జిలను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే



సీసీకుంట సమీపంలో వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అడ్డాకుల, నవంబరు 7: వంతెన నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులతో చర్చలు జరిపి వారికి ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి యుద్ధ ప్రాతిపతికన బ్రిడ్జి నిర్మాణంను పూర్తి చేసి వాగు పరిసర గ్రామాల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం అడ్డాకుల మండలంలోని వర్నెవాగుపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్నె, ముత్యాలంపల్లి, పేరూరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రం సమీపంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన హైలెవల్ వంతెనను గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే స్వర్ణాసుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి కోరారు. జడ్చర్ల మండలంలోని కోడ్గల్, పెద్దఆదిరాల గ్రామాలలో గురువారం బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సన్నవరి ధాన్యంకు రూ.500 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, డైరెక్టర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిరెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ మోహన్ రావు

గండీడ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్ రావు సర్వే సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో అధికారుల బీసీ కులగణన సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ గనణలలో అధారులు చూసుకోవాలన్నారు. మండలంలోని ప్రజలు పర్వే అధికారులకు సమగ్ర వివరాలు అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దెవన్న, సిబ్బంది వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పీజీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి

- పీయూ రిజిస్ట్రార్‌కు ఏబీవీపీ నాయకుల వినతి



రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాల్గవ సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలి పీయూ ఏబీవీపీ విద్యార్థుల పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ విద్యార్థులు మాట్లాడుతూ వీలైనంత త్వరగా పీజీ నాల్గవ సెమిస్టర్, రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని కోరారు. పీజీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు పూర్తయి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ఫలితాలు రాక విద్యార్థులు విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని, విద్యార్థుల ఉన్నత చదువులను, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫలితాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, వేణుగోపాల్, సతీష్ కుమార్, వేణు పాల్గొన్నారు.